పదిరూపాయలకోసం

నిష్ఠల బహ్మాజీ

కాఫీనీళ్ళు గొంతుకలో చిలకరించుకుంటూనే ఆఫీసు కాయితాలు చూసుకుందామని వీధి గదిలో దూరాడు దత్తాత్రేయం.

కిటికీతలుపులు తెరిచి చూశాడు. టేబుల్ మీద కాయితాల కట్టలు పడివున్నాయి. అతనికి చిరాకు పుట్టింది. విసుక్కున్నాడు.

వెధవ నౌకిరీ! ఒక్క మూడురోజులు వూళ్లో లేకపోతే సరి; గంపెడు కాయితాలు చాకిరీ చెయ్యమని కాసుకు కూర్చుంటాయి. నానాటికీ పెరగడమే కాని తరగడం వుండదు. అనునిత్యమూ చేస్తూనే ఉండాలి. అందుకనే అతను యేరోజు కాయితాలు ఆరోజే ఫైసల్ చేసేస్తూ వుంటాడు. అవసరమైన వాటిని అతిభద్రంగా డ్రాయర్లో దాస్తాడు. అనవసరమైన వాటిని చించేసి చిత్తుకాయితాల బుట్టలో పడేస్తాడు. ఏమైనా తలమున్కలవుతున్నాక యేదో ఒకటి చెయ్యక తప్పుతుందా మరి!

కుర్చీ కొంచెం ముందుకు లాక్కుని బల్ల దగ్గరకు వేసుకున్నాడు. పైమీది కండువా తీసి దుమ్ము దులుపుకుని కూర్చున్నాడు. కాయితాలు ఒక్కొక్కటే తీసి చూడ్డం మొదలెట్టాడు.

రెండు మూడు కాయితాలు ఓపిగ్గా చూసేడు. అక్కణ్ణించి గబగబా పేజీలు తిరగేసి పరపరా చించేయడం మొదలెట్టాడు. "అన్నీ పనికిమాలిన కాయితాలే! హాస్కు కాయితాలే! ఒక్క పైసా అయినా వొచ్చే కాగితం ఒక్కటి అవుపించదు. అన్నీ పిటిషన్లే! అన్నీ అర్జీలే!" అని సణిగాడు.

దత్తాత్రేయానిక్కూడా అందరికి మల్లేనే డబ్బంటే ప్రాణం. పైసా చేతిలో పడితే కాని యేపనీ చెయ్యలేడు. చేతిలోపడ్డ పైసా పైకి పోనివ్వడు. శ్రీదేవి వొస్తే మోకాలు అడ్డం పెట్టడు. అలాంటిది మూడురోజుల క్రిందట శిస్తుల వసూలుకి వెళ్ళి ఖాళీ చేతుల్తో తిరిగి వచ్చాడు. తాపులు మాత్రం తప్పి బయటపడగలిగాడు. రానూ పోనూ ఖర్చులు వ్యర్థమయ్యాయి. ఆ సొమ్ము కొస్తా యెలాగో ఒకలాగ రాబడితేకాని అతని మనసు కుదుటబడదు.

ఇదే ఆలోచిస్తూ క్రమంగా పనిలో లీనమైపోయాడు. కళ్ళు కాగితం వెనుక కాయితాన్ని గబగబా దాటుకుపోతున్నాయి. చేతులు చరచరా కాయితాల్ని అందుకుని పరపరా చింపుతున్నాయి. కిటికీ వూచల్లోంచి చండభానుని కాంతి సూటిగా చొచ్చుకుపోయి కాయితాలమీద ప్రసరిస్తూంది. అతను దీక్షతోనే పని కొనసాగిస్తున్నాడు.

రాధిక ద్వారందగ్గర నుంచుని గదిలోకి తొంగిచూసింది. గదిలో ఆతనొక్కడే వున్నాడు. లోపలికి ప్రవేశించింది. కాని అతను పనిలో వుండడంవల్ల పలకరించడానికి ధైర్యం చాలిందికాదు. చేతిలో వున్న కవరుపైకి కనుపించకుండా చేతులు వెనక్కు పెట్టుకుని మేజాబల్లముందు నుంచుంది, అతని దృష్టిని ఆకర్షించడానికి.

దత్తాత్రేయం కన్నెత్తి చూడలేదు. ఆమె ఎందుకొచ్చిందో కూడా అడగలేదు. పిటిషను కాగితాన్ని వీరావేశంతో చిత్రవధ చేయడంలో నిమగ్నుడైపోయాడు.

రాధిక మెల్లగా దగ్గింది.

దత్తాత్రేయం కదల్లేదు, మెదల్లేదు. మౌని అయ్యాడు.

ఆమె గాజులు గలగలమని చప్పుడు చేసింది.

ఈసారికూడా అతను కిక్కురుమనలేదు. కాయితాల్ని యింకా జోరుగా కత్తిరిస్తున్నాడు. ఆమె ఇహ సహించలేకపోయింది.

"ఏమిటా పని?" అన్నది.

"ఏదో వల్లకాటిపని." దృష్టి మరల్చకుండానే అతను జవాబిచ్చాడు.

"మీకు నిజంగా మతిపోతూన్నట్లుంది!"

అతను మాట్లాడలేదు. ఆమె మళ్ళీ అందుకున్నది:

"స్నానం చెయ్యరాదూ! ఒళ్లుకొస్త చల్లబడుతుంది."

"ఏదో యేడుస్తాను. నువ్వూరుకో! లేకపోతే పని జరగదు."

విసుక్కున్నాడు.

రాధిక కొంచెం ముందుకు వంగి మోచేతులు బల్లమీద వాల్చింది. కవరు కుడిచేతి వేళ్ళ సందున యిరికించి, ముఖం అరచేతుల్లో యిముడ్చుకుంది.

"ఎప్పుడూ మీరింతే! ఏదో చిరాగ్గానే వుంటారు" అన్నది తన అనుభవాన్ని తల్చుకుని.

"పోనీ నీకు హుషారుగా వుందికదా!" కళ్లద్దాల్లోంచి కాయితాలు చూస్తూ అడిగాడు.

"కాకపోతే మరేమిటి! కాపరానికొచ్చిన కొత్తలో కాకపోతే పదిమందిని కన్నాక వుండడమంటే మాత్రం హుషారుగా వుండగలమూ?" మందహాసం చేసింది రాధిక.

దత్తాత్రేయం తల షేకత్తాడు. మేజాబల్లమీద మోచేతు లానుకుని పద్రవేళ్లమధ్యని ప్రకాశిస్తూన్న రాధిక మందస్మితవదనం వికసిస్తూన్న కలువ పువ్వులా అతని కళ్లకు కనిపించింది. ఆమె చెప్పిన చురుకుదనం నిజంగా ఆమె చిలిపి కళ్లలో తొణికిసలాడుతూవుంది.

"రాధ! నా సంగతి నీకు తేలీదూ! మనక్కావల్సింది డబ్బు. అదే దొరికితే నేనూ నీకన్న వెయ్యిరెట్లు హుషారుగా వుంటాను" అన్నాడు, తన చిరాక్కు కారణం ధనమే నన్నట్లు.

"డబ్బు...డబ్బు...డబ్బు అంటారు. ఈ సంపాదన మనకి చాలదూ! ఎందుకొచ్చింది హాయిగా వుండక!" ధనం అంటే అయిష్టం కనబర్చింది రాధిక.

ఆ తరవాత ఒయ్యారంగా ఒకసారి ఒళ్లు విరుచుకుని చేతులు దులిపింది. చేతుల్లో వున్న కవరు జారి క్రిందపడింది. దత్తాత్రేయం కళ్ళు పెద్దవి చేశాడు.

"ఆ కవరేమిటి? ఎక్కణ్ణించి వొచ్చింది?"

"ఏం? ఎక్కణ్ణించేనా మీకు రావాలా?"

"రావాలి. విశ్వంభరం దగ్గర్నుంచి."

"అయితే అదే యిదంటారా?"

"అబ్బ! నన్ను చంపక యివ్వు." ప్రాధేయపడ్డాడు.

"ఇది మీ రనుకున్న మనిషి వ్రాసింది కాదు."

"ఏదీ! చూడనీ పోనీ"

"నేను చెబుతున్నాను కదూ!"

"చిలిపితనం మాను రాధా!"

"నిజం. ఇది మా నాన్న దగ్గర్నుంచి వొచ్చింది. చూడండి."
అంటూ కవర్లోంచి కాయితం పైకి తీసి అందించింది రాధిక.

దత్తాత్రేయం గుడ్లు మిటకరించాడు. ముందున్న ఆసక్తి ఆతురత అడుగంటిపోయాయి.

"అబ్బ! నా పనంతా చెడగొట్టేవు రాధ! అనవసరంగా గొడవ చేశావు" అన్నాడు నిరుత్సాహంగా.

రాధిక చిలిపిగా నవ్వింది. దత్తాత్రేయం టేబుల్ మీద తలవాల్చాడు శ్వాసవిడుస్తూ.

"ఏం వూరుకున్నారు? ఉత్తరం చూడరూ!" వెటకారంగా అడిగిందామె.

"చూస్తాలే తరవాత" దత్తాత్రేయం అయిష్టంగానే అన్నాడు.

"కాదు. ఇప్పుడే చూడండి" ఆమె మొండిపట్టు పట్టింది.

"ఏం? విశేషాలేమైనా వున్నాయా?" వుండవనే తలంపుతోనే అడిగాడతను.

"ఉండబట్టే! లేకపోతే మీ పని మానుకుని చదవమంటానా?"

దత్తాత్రేయం కాయితం మడతలు విప్పాడు.

టేబుల్ మీద పదిలంగా కవరు పెట్టింది రాధిక—"అందులో పది రూపాయల నోటు పెట్టి పంపించారు మా నాన్న" భుజాలెగరేస్తూ గొప్పగా చాటుకుంది.

దత్తాత్రేయం ఆశ్చర్యపోయాడు. ఉత్తరం మూడు మార్లు చదువుకున్నాడు. ఇంకా నమ్మకం చాలక 'నిజంగా నా రాధా?' అన్నాడు.

"అయ్యో! ఇంకా నమ్మకం లేదా? కావలిస్తే చూడండి!" అంటూ కవరుపై పు కక్షి త్రిప్పింది రాధిక.

దత్తాత్రేయానికి అవగాహన కాలేదు. ఉత్తరం మరోసారి చదువుకుని తృప్తిగా నవ్వుకున్నాడు. టేబుల్ మీద వుత్తరం పడేసి యింకో కాయితాల కట్ట తీశాడు. అతన్ని వీధిలోంచి యెవరో పిలిచారు. రాధిక యింట్లోకి వెళ్లిపోయింది. దత్తాత్రేయం చేతులో వున్న కాయితాలు టేబుల్ మీద పడేసి తలుపు తీయడానికి వెళ్ళేడు.

*　　*　　*

సాయంత్రం వీధులోకి వెళ్తూన్న భర్తని వెనక్కు పిల్చింది రాధిక—"ఏమండీ! ఓ రెండు గజాలు జార్జెట్ సిల్కు బట్ట తెచ్చిపెట్టరూ!"

"అబ్బో! చాలా ఖరీదుంటుంది" అన్నాడు దత్తాత్రేయం.

"ఉంటే వుండనీయండి. నాన్న పంపిన సొమ్మే కదా!" రాధిక ఖాతిరీ చెయ్యలేదు.

"ఆం. ఇన్నాళ్లకి యెలాగైతేనేం పంపించారులే మీ నాన్న; పదిరూపాయలు! మిడిసిపడిపోకు." ఎగతాళి చేశాడు దత్తాత్రేయం.

"నేనేం మిడిసిపడలేదు. ముచ్చట పడ్డాను. ఇంతకీ తెస్తారా? తేరా?" అని అడిగింది రాధిక.

"సరే. ఇలాతే ఆ నోటు. తెస్తాను." అన్నాడు దత్తాత్రేయం.

"మీ దగ్గరే వుందికదూ!"

(43-వ పేజీ చూడండి)



(25-వ పేజి తరువాయి)

"నా దగ్గరేముంది?" పెదిమ విరిచాడు దత్తాత్రేయం.

"బాగుంది నాటకం!" అంది రాధిక.

"నాటకమేమిటి? మీ నాన్న పంపిన సొమ్ము తీసుకురా"

"ఔను. దానిమాటే నేనూ చెప్తున్నాను. పొద్దున్న మీ కిచ్చిన కవర్లో పెట్టాను. కొంపతీసి పారేశారేమిటి?" తెల్లబోయింది రాధిక.

దత్తాత్రేయం మేకపోతుగాంభీర్యం చూపించాడు - "ఎక్కడికి పోతుంది! టేబుల్ మీదే వుండివుంటుంది." అన్నాడు.

"ఆఁ. వుంటుందిలెండి!" వెక్కిరించింది రాధిక.

దత్తాత్రేయం గదిలోకి పరిగెత్తాడు. టేబుల్ మీది కాయితాలన్నీ తిరగేసి చూశాడు. కవరు కనిపించలేదు. డ్రాయర్లు వెతికిచూశాడు. టేబుల్ చుట్టూ చూశాడు. జేబులు దులిపాడు. మొత్తంమీద గదంతా గాలించాడు. ఎక్కడా కనిపించలేదు.

"రాధా! నువ్వు కవరు తీసుకోలేదూ?" అన్నాడు సందేహిస్తూ.

"బాగుంది వరస! నేను తీస్తే మిమ్మల్నెందు కడుగుతాను?" ఎదురు ప్రశ్న వేసింది రాధిక.

"అది సరేకాని, నోటు వెంటనే తీసి దాచుకోవద్దూ! తెలివి తేటలు!" అన్నాడు దత్తాత్రేయం తప్పు తనదికాదన్నట్టు.

రాధిక ఈ మాటకు జబాబియ్యలేదు. హేళనగా ఒకసారి తలూచి "జేబులు చూశారా?" అంటూ భర్తని క్రాస్ ఎగ్జామిన్ చేయటం మొదలు పెట్టింది.

"చూశాను." అన్నాడు అతను.

"టేబుల్ డ్రాయర్లు?"

"చూశాను. వాటిలోనూ లేదు."

"మధ్యాహ్నం మీరు లోపలికి వచ్చిం తర్వాత గదిలోకి యెవరైనా వెళ్లారా?"

దత్తాత్రేయం చూపుడువేలితో తాళువ మీద ఒకసారి కొట్టుకున్నాడు. ఆ తర్వాత "దాలెమ్మ వెళ్లింది గది తుడవడానికి." అన్నాడు.

"అయితే దాలెమ్మదే యీదెబ్బ!" అంది రాధిక.

దత్తాత్రేయం యెటూ నిర్ణయించలేకపోయాడు. ఏమనడానికీ నోరు పెగిలింది కాదు. దాలెమ్మ దొంగతనం చేసిందనడానికి తగిన నిదర్శనమూ వుంది. చేయలేదనడానికి అవకాశమూ వుంది. దాలెమ్మ యింతకు ముందెప్పుడూ యిటువంటి పాడుపని యెక్కడా చేయలేదు. ఇప్పుడు చేసిందనడానికి నమ్మకమేమిటి? ఏమో? డబ్బు పాపిష్టిది. ఎంత మంచివాళ్లనైనా పెడత్రోవల్లో పెడుతుంది. ఆలోచిస్తూ నిల్చుండిపోయాడు. రాధిక కూడా యీమాటే అంది.

"దాని నమ్మకం మనకేమిటి? చూసిన తరువాత తీసుకోకుండా వుంటుందా! గదిలోకి వెళ్లిన తర్వాత కవరు దాని కళ్లబడకుండా వుంటుందా? రేపొద్దున్న రానీండి; దాని భరతం పట్టిస్తాను."

దత్తాత్రేయం మౌనంగా వూరుకున్నాడు.

మర్నాడు వుదయాన దాలెమ్మ పాచిపనికి వచ్చింది. లోపలకు రాగానే అడిగింది రాధిక-"ఏమే నిన్నను వీధిగది తుడిచావా?" అని.

ఔనన్నట్టు తలూపింది దాలెమ్మ.

"టేబుల్ మీది కాయితాలు సవరించావా?" కూపీలు లాగయత్నించింది రాధిక.

"కొత్తగా అడుగుతున్నారేఁవమ్మా?" మామూలు ధోరణిలోనే అంది దాలెమ్మ.

"టేబుల్ మీది కవరు యేంచేశావ్?" ఈ ప్రశ్నమాత్రం కఠినంగానే అడిగింది రాధిక.

దాలెమ్మ ఈ ప్రశ్నకు సరియైన సమాధానం చెప్పలేకపోయింది. మొదట్నుంచీ రాధిక ధోరణి ఆమెకు వింతగానే కనిపించింది. ఇప్పుడీ ప్రశ్నతో భయం కూడా వేసింది.

"నే నెరగనమ్మా!" అన్నది అమాయకంగా చూస్తూ.

"నిజం చెప్పు! లేకపోతే నిలువునా చీరేస్తాను! టేబుల్ మీదవున్న కవరు నువ్వు తియ్యలేదూ?" రౌద్రాకారం దాల్చాడు దత్తాత్రేయం.

"సంగనాచి కబుర్లు మాని కాజేసిన పది రూపాయలు బయటపెట్టు" అన్నది రాధిక.

దాలెమ్మ గడగడా వొణికిపోయింది. లబోదిబోమని మొత్తుకుంది. ఏ పాపం యెరగనని యేడ్చింది.

రాధిక నయానా భయానా అడిగింది. పోలీసులకు అప్పజెప్తానని భయపెట్టింది. "ఎలా తీశావో అలానే పడెయ్" అని మంచిగానూ చెప్పిచూసింది. కాని ఫలితం బండిసున్నా అయింది.

ససేమిరా నేను తియ్యలేదు అన్నది దాలెమ్మ. ఏ ఒట్టు వేయమంటే ఆ ఒట్టు వేస్తానంది. చివరకు మెళ్లో వున్న మంగళసూత్రం పట్టుకునికూడా ప్రమాణం చేసింది.

కాని రాధకు దాలెమ్మమీద అనుమానం తీరలేదు. దత్తాత్రేయం కూడా చేసేది లేక దాలెమ్మను తక్షణం పనిలోంచి తొలగించాడు. చేసినంతమట్టుకైనా జీతం యివ్వకుండా తగిలేశాడు.

నెల్లాళ్ళ తరవాత ఓ రోజు మధ్యాహ్నం మిడిమిడి ఎండలో యింటికి వొచ్చాడు దత్తాత్రేయం.

"అబ్బ! ఫెళ్ళుమంటూంది ఈ వాళ ఎండ" అన్నాడు చొక్కావిప్పి గోడనున్న మేకుకి తగిలిస్తూ.

"నిన్నను హోరుమని వానకురిసింది కదూ! అంచేత ఫెళ్ళుమంటూంది ఈవాళ ఎండ. మబ్బు విడిచిన ఎండమరి" అన్నాది రాధిక మంచంమీద నడుం వాలుస్తూ.

"తల దిమ్మెక్కిపోయింది. కొంచెం కాఫీనీళ్లుపడేద్దూ!" అన్నాడు దత్తాత్రేయం.

రాధిక సహజంగా చురుగ్గా తిరుగుతుంది. కాని ఒకప్పుడు కాకపోతే మరొకప్పుడైనా బద్ధకం కలగడం మానవులకు సహజం! అందులోనూ అప్పటివరకూ వంటింటి పనుల్లో వొళ్లు ముద్దయిపోయివుందామెకు. అంచేత తప్పించుకోడానికి దారిచూసింది.

"బొగ్గులు చెమ్మగా వున్నాయండీ! నిన్నటి వానలో తడిసిపోయాయి" అన్నది.

దత్తాత్రేయం మాత్రం కనికరించలేదు. పైగా రాధిక సమాధానంకూడా అంత నమ్మతగ్గదిగా అతనికి తోచలేదు.

"పర్వాలేదులే. మరి నాలుగు కాయితాలు మంటబెడితే మహారాజులా నిప్పవుతుంది" అన్నాడు సుళువుగా.

రాధిక విసుక్కుంది. "సరే. చిత్తుకాయితాలు ఓ నాలుగు నా మొహాన పారెయ్యండి" అన్నది కుంపట్లో బొగ్గులువేస్తూ.

దత్తాత్రేయం అంతకూ వెనక తగ్గలేదు.

"కాయితాలకేం కరువొచ్చింది! చిత్తుకాయితాల బుట్ట తిరగేస్తే కుప్పలు కురుస్తాయి. బద్ధకించక వెళ్లు." అని ఆజ్ఞచేశాడు.

చిరాగ్గా వెళ్లి చిత్తుకాయితాల బుట్టలో చెయ్యి దూర్చింది రాధిక. చేతికి చిక్కిన నాలుగు కాయితాలు తెచ్చి కుంపట్లో పెట్టింది. అగ్గిపుల్లగీస్తూ కుంపట్లోకి చూసి నిస్పృహతో నిశ్వసించింది.

చేతిలోవున్న అగ్గిపుల్ల ఆమె నిట్టూర్పు గాలికి ఆరిపోయింది. వెంటనే దత్తాత్రేయాన్ని పిల్చింది - "ఏమండీ! ఇలా చూడండి!"

దత్తాత్రేయం ఒక్కక్షణంలో ప్రత్యక్షమయ్యాడు. రాధిక, నోట మాటాడక కుంపట్లో దగ్ధం కావడానికి సలిగిపోయి సిద్ధంగావున్న, పదిరూపాయల నోటుని మడత విప్పి చూపెట్టింది.

"ఎంతపని చేశాం రాధా! దాలెమ్మని అనవసరంగా అనుమానించాం! నిందించాం! ఈపాపం యెలా పోతుంది?" కించపడ్డాడు దత్తాత్రేయం.

రాధిక మెల్లగా సణుగుతూ - "పాపిష్టి డబ్బు! దగ్ధం కానివ్వండి?" అంటూ నోటు ముట్టించివేసింది. ★